ప్రజాశక్తి
ఆదివారం 28 సెప్టెంబర్ 2025
5
పార్వతీపురం మన్యం

ఇళ్ల బిల్లులు మంజూరు చేయాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

నియోజకవర్గంలోని 2014- 19 మధ్య నిర్మాణాలు చేపట్టిన 2767 ఎన్‌టిఆర్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అసెంబ్లీలో కోరారు. నాన్ షెడ్యూల్డ్ జాబితాలో ఉన్న దుడ్డుఖల్లు, టికె జమ్ము, పిటిమండ, గుమ్మడిగూడ పంచాయతీలను షెడ్యూల్డ్ ఏరియాలోకి మార్చాలని కోరారు. రేగిడి, వట్టిగెడ్డ, గుమ్మడి గెడ్డను అనుసంధానం చేయాలన్నారు.

గిరిజన గ్రామాలకు వైద్య సేవల కోసం కాలినడకన వెళ్తున్న వైద్యులు, సిబ్బంది (ఫైల్)

తాడో పేడో

- దశల వారీ పోరాటానికి సిద్ధమైన పిహెచ్‌సి వైద్యులు
- ఏజెన్సీలో పనిచేస్తున్న డాక్టర్లకు అష్టకష్టాలు
- ఉద్యోగోన్నతులు, అలవెన్సులు రావడం లేదని ఆవేదన
- దసరాలోగా స్పందించకుంటే నిరవధిక దీక్షలకు పిలుపు

ప్రజాశక్తి-పార్వతీపురం

రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం దశలవారీ పోరాటానికి దిగారు. రానున్న దసరా పండుగలోగా ప్రభుత్వం డిమాండ్లపై స్పందించకపోతే మరుసటిరోజు నుంచి నిరవధిక దీక్షలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం పోరాట కార్యాచరణ రూపొందించింది. దీనిలో భాగంగా ఈ నెల 26 నుంచి దశలవారీ పోరాటానికి సిద్ధమయ్యారు. తొలి రెండు రోజుల్లో అన్నిరకాల వైద్య శిబిరాల నిర్వహణకు సంబంధించిన ఆన్‌లైన్ పనులు నిలిపివేశారు. ఈ నెల 28 నుంచి ఉన్నతాధికారులకు సంబంధించిన అన్ని వాట్సాప్ గ్రూపుల నుంచి బయటకు రావాలని నిర్ణయించారు. 29న పిహెచ్‌సిల్లో ఒపి సేవల బహిష్కరణ, అత్యవసర సేవలకు హాజరవడం, 30న నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు చేపట్టడం, అక్టోబర్ 1న జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. అక్టోబర్ 2లోగా రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే సమ్మెకు సిద్ధమవుతున్నారు. 3న చలో విజయవాడ కార్యక్రమంలో భాగంగా రాజధానిలో నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టాలని నిర్ణయించారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్యానికి నిరసనగా అమీతుమీ తేల్చుకునేందుకు ఏజెన్సీ ప్రాంతంలో పని చేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సిద్ధమయ్యారు.

పిహెచ్‌సి వైద్యులపై చిన్నచూపు ఎందుకు?

ఏజెన్సీ ప్రాంతాల్లో పని చేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు అనేక ప్రతికూల పరిస్థితుల్లో గిరిజనులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఒక్కో పిహెచ్‌సి పరిధిలో పదుల సంఖ్యలో మారుమూల గిరిజన గ్రామాలు, గిరిశిఖర గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాల్లో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రాలకు వెళ్ళి వైద్య సేవలు అందించడం వైద్యులకు కత్తిమీద సాములా తయారైంది. కనీస రహదారి సౌకర్యం లేని గిరి శిఖర గ్రామాలకు సైతం కాలినడకన వెళ్లి సేవలు అందించాల్సిన పరిస్థితి. ముఖ్యంగా మన్యం జిల్లాలో ఇలాంటి పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి. జిల్లాలో తోణాం, మామిడిపల్లి, మక్కువ, శంబర, పాచిపెంట, గురువు నాయుడు పేట, కొమరాడ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, పాలకొండ, సీతంపేట మండలాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎక్కువగా గిరిశిఖర గ్రామాలు ఉన్నాయి.

మన్యం జిల్లాపై ప్రభావం ఎక్కువ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సమ్మె సైరన్ మోగించడంతో మన్యం జిల్లాపై తీవ్ర ప్రభావం చూపనుంది. జిల్లాలో 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 67 మంది వైద్యులు పని చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎక్కువ శాతం ఏజెన్సీ ప్రాంతాల్లోనే ఉన్నాయి. మారుమూల గ్రామాల గిరిజనులకు వీటి ద్వారా వైద్య సేవలు అందుతున్నాయి. ఒకవేళ సమ్మె అనివార్యమైతే ఏజెన్సీ ప్రాంత గిరిజనులే ఇబ్బందులు ఎదుర్కోనున్నారు.

కొండలు, గుట్టలు, వాగులు, వంకలు దాటుకుంటూ కిలోమీటర్ల మేర నడుస్తూ ఈ గ్రామాలకు చేరి వైద్య సేవలు అందించాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏజెన్సీ ప్రాంత వైద్యుల పట్ల ప్రభుత్వాలు సవతితల్లి ప్రేమ కనబరచడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనేకసార్లు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలకు వినతులు అందజేసినా ఫలితం లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో పోరుబాట పట్టారు.

డిమాండ్లు ఇవే

ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు ఇన్-సర్వీస్ పిజి కోటాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకప్పుడు పిహెచ్‌సి వైద్యులకు ఇన్ సర్వీస్ పిజి కోటా 50 శాతం ఉండేది. దాన్ని తర్వాత 30శాతానికి తగ్గించారు. 2024లో ఆ కోటాని 15 శాతానికి తగ్గించడంతో వైద్యులు నిరసన తెలిపారు. అనంతరం ప్రభుత్వం మరో 5 శాతం పెంచి 20 శాతంగా నిర్ణయించింది. 2025లో టిడిపి కూటమి ప్రభుత్వం మళ్లీ రిజర్వేషన్ కోటాని 15 శాతానికి తగ్గించింది. దీనిని 20శాతం కొనసాగించాలని వైద్యులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విధానాలు మార్చడంతో నష్టం జరుగుతోందని వైద్యులు భావిస్తున్నారు. టైమ్-బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని కోరుతున్నారు. నిర్దేశిత కాలవ్యవధిలో ఉద్యోగోన్నతి కల్పించాలనే నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఏరియా ఆసుపత్రి, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులు రెండు, మూడు ఏళ్లలోనే ఉద్యోగోన్నతులు పొందుతున్నారు. అదే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న వైద్యులకు ఉద్యోగోన్నతులు అందని ద్రాక్షగా ఉన్నాయి. గతంలో మామిడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా పని చేసిన రెడ్డి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ చేసినంత వరకు ఉద్యోగోన్నతి పొందలేదు. ఇలాంటి పరిస్థితులపై వైద్యులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పేపై 50 శాతం ట్రైబల్ అలవెన్స్ మంజూరు చేయాలని కోరుతున్నారు. నోషనల్ ఇన్‌క్రిమెంట్స్ మంజూరు చేయాలని, చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రామ్ కింద వైద్యులకు రూ.5 వేలు అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. నేటివిటీ, అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇవికాక తక్షణమే కొన్ని డిమాండ్లను ఆమోదించాలని కోరుతున్నారు. పిహెచ్‌సి వైద్యులకు కచ్చితమైన పని గంటలు, స్థిరమైన వారాంతపు సెలవు ఇవ్వాలని, జాబ్ చార్ట్ రూపొందించాలని, విషపూరితమైన పని వాతావరణాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అనధికార వ్యక్తులు, వైద్య ఆరోగ్య శాఖకు సంబంధం లేని అధికారులు పిహెచ్‌సిలను పరిశీలించడంపై స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలని కోరుతున్నారు. ఈ డిమాండ్లపై ప్రభుత్వం దసరాలోగా స్పందించాలని వైద్యుల సంఘం అల్టిమేటం ఇచ్చింది. ఒకవేళ ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

నిరసన చేపడుతున్న ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు

మక్కువ - సాలూరు రోడ్డు పనులు పూర్తిచేయాలని

ప్రజాసంఘాల ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-మక్కువ

మక్కువ నుండి బాగువలస మీదుగా వెళ్లే సాలూరు రోడ్డును వెంటనే పూర్తి చేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మక్కువ ప్రధాన రహదారిలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కొల్లి గంగునాయుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వై.నాయుడు మాట్లాడుతూ గత ఆరేళ్లుగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లే పరిస్థితి లేదన్నారు. అందువల్ల మక్కువ నుంచి సాలూరు వెళ్లే ప్రజలంతా మామిడిపల్లి మీదుగా వెళ్లాల్సి వస్తోందన్నారు. సాలూరు, మక్కువ మండలాల్లోని అన్ని గ్రామాలకు ఈ రోడ్డు చాలా ఉపయోగకరమని తెలిపారు. ఎంతో ఉపయోగకరమైన రోడ్డు పనులు ఇద్దరు మంత్రులు మారినా పూర్తి కాలేదని విమర్శించారు. గతేడాది ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దుగ్గేరు వచ్చి సిరివర రోడ్డుకు శంకుస్థాపన చేశారని, ఆ సమయంలో మన్యం జిల్లాలోని రోడ్లన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. హామీ ఇచ్చి సంవత్సరం దాటుతున్నా ఇంతవరకు రోడ్డు పూర్తి కాలేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రహదారులన్నీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

నగర పంచాయతీ సిబ్బంది తీరుపై

కౌన్సిలర్ల ఆగ్రహం

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ నగర పంచాయతీ సిబ్బంది తీరుపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అజెండా తయారీ చేయడంలో నిర్లక్ష్యం వహించారని ధ్వజమెత్తారు. చైర్‌పర్సన్ ఆకుల మల్లేశ్వరి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటదుర్గ అమ్మవారి దసరా ఉత్సవాలకు శానిటేషన్ సిబ్బందిని పంపించే ముందు సభ్యులకు ఎందుకు తెలియజేయలేదని ఆకుల కుమార్ ప్రశ్నించారు. నగర పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని, ఇదే విషయం ఇటీవల పత్రికల్లో వస్తున్నా కమిషనర్ ఏం చేస్తున్నారని దుప్పాడ పాపినాయుడు ప్రశ్నించారు. అజెండాలో పలు అంశాల్లో స్పష్టత లేదని, తప్పులు తడకలతో ఉందని సభ్యులు నిలదీశారు. అజెండాను మార్చిన తర్వాత మళ్లీ సమావేశం ఏర్పాటు చేయాలని సభ్యులు సభ నుంచి లేచి వెళ్లిపోయారు. తర్వాత వారిని కమిషనర్, కొందరు కౌన్సిలర్లు సముదాయించి సమావేశానికి రప్పించారు. దీంతో మళ్లీ సమావేశమైన కౌన్సిలర్లు అజెండాలోని అంశాలకు ఆమోదం తెలిపారు. కమిషనర్ రత్నంరాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అమృత్ భారత్ రైలు ప్రారంభం

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

అమృత్‌భారత్ రైలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

బరంపురం నుంచి సూరత్‌కు అమృత్ భారత్ రైలును ప్రధానమంత్రి మోడీ వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ రైలు శనివారం సాయంత్రం పార్వతీపురం రైల్వేస్టేషన్‌కు చేరుకోవడంతో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, ఎడిఆర్ఎం శాంతారామ్, ట్రాన్స్ పోర్టు డైరెక్టర్ డి.శ్రీనివాసరావు జెండాఊపి ప్రారంభించారు.

విద్యార్థి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

విద్యార్థి అంజలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు

మండలంలోని కంబగూడలో మృతి చెందిన విద్యార్థిని అంజలి కుటుంబ సభ్యులను ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం పరామర్శించారు. గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అనారోగ్యం వాటిల్లితే స్థానికంగా వైద్య సేవలు అందించడానికి ఆరోగ్య సిబ్బంది లేకపోవడంతో తరచూ మరణాలు సంభవిస్తున్నాయని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బిడ్డిక అనిల్ అన్నారు. పాఠశాలలకు దూరంగా ఆసుపత్రులు ఉండడంతో విద్యార్థులకు సకాలంలో వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా విద్యార్థుల మరణాలు సంభవిస్తూనే ఉన్నాయన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి మొదటి సంతకం అమలు చేయాలని, లేకుంటే గిరిజన ఎమ్మెల్యేల ఇళ్లను, కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. అంజలి కుటుంబాన్ని ప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి పువ్వల తిరుపతిరావు, నాయకులు ఎం.వెంకటరావు ఉన్నారు.

చెరువుల ఆక్రమణపై

దర్యాప్తు నివేదికను ఇవ్వండి

ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-పార్వతీపురం

మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

దేవునిబంద, కామయ్య బంద, వరహాలుగెడ్డ, నెల్లిచెరువుల ఆక్రమణలపై ప్రభుత్వం చేపట్టిన దర్యాప్తు నివేదికను బహిర్గతం చేయాలని ఎపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కృష్ణమూర్తి, రెడ్డి లక్ష్మునాయుడు మాట్లాడుతూ పార్వతీపురం పట్టణ ప్రజలకు నీటి వనరులుగా నిలిచిన చెరువులు కబ్జాకు గురయ్యాయని తెలిపారు. ప్రభుత్వం చొరవతో వాటికి రెడ్ మార్కులు కూడా వేశారని, అయినా చర్యలు చేపట్టకపోవడం అన్యాయమని అన్నారు. చెరువుల కబ్జాపై గత మే నెల 21న అప్పటి కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదుకు ఫిర్యాదు చేశామని గుర్తుచేశారు. అనంతరం కబ్జాలకు గురైన చెరువులపై డిఆర్ఒ హేమలత సమక్షంలో దర్యాప్తు జరిగినట్టు, 24 మంది కబ్జాదారులకు ప్రభుత్వం నోటీసులు అందించినట్టు లేఖ రూపంలో తమ సంఘానికి తెలిపారని వివరించారు. కలెక్టర్ ఆదేశించినా కబ్జాదారులపై ఇంతవరకూ చర్యలు లేవన్నారు. కనీసం ఎటువంటి నివేదిక కూడా పొందుపరచకపోవడం అన్యాయమని మండిపడ్డారు. కబ్జాదారులు ఎంతో స్వేచ్ఛగా, రాజకీయ, అధికారుల అండదండలతో చలామణి అవుతుండడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు చిత్తశుద్ధితో స్పందించి పట్టణంలో కబ్జాలకు గురైన చెరువుల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని, వాటి భూములను ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, గేదెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులం బిల్లు చెల్లించాలి

మినీ గోకులం షెడ్ బిల్లు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎపి రైతుసంఘం నాయకులు కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డికి వినతి అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కృష్ణమూర్తి, రెడ్డి లక్ష్మునాయుడు మాట్లాడుతూ 2014లో పార్వతీపురం మండలం తాళ్లబురిడి గ్రామంలో 12 మంది రైతులకు ఉపాధి హామీ కింద మినీ గోకులాల షెడ్లు మంజూరైనట్టు అధికారులు తెలిపారన్నారు. షెడ్ల నిర్మాణం కోసం కొంతకాలం వరకు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో, బడే తిరుపతిరావు అనే వ్యక్తి సొంత డబ్బుతో షెడ్డు నిర్మించారని తెలిపారు. బిల్లు చెల్లించాలని పలుమార్లు అధికారులను కోరినా, నేటికీ విడుదల చేయకపోవడం అన్యాయమని అన్నారు. వెంటనే కలెక్టర్ కలుగజేసుకొని బడే తిరుపతిరావుకు బిల్లు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బడే తిరుపతిరావు, బేత నాగభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న ఫెడరేషన్ నాయకులు, మున్సిపల్ కార్మికులు

జనసేన కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలి

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి-సాలూరు

గుంటూరులో మహిళా కార్మికురాలు దేవర పద్మను దూషించిన జనసేన పార్టీ కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు టి.శంకర్రావు మాట్లాడుతూ జనసేన పార్టీ కార్పొరేటర్ శ్రీనివాసరావు మూణ్నాలుగు సార్లు ఇలాగే ప్రవర్తించారని తెలిపారు. వెంటనే ఆయనపై జనసేన పార్టీ, మున్సిపల్, పోలీసు ఉన్నతాధికారులు చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. పని ప్రదేశాల్లో మహిళా కార్మికులకు భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పోలరాజు, అర్జున్, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మను దర్శించుకున్న జడ్జి

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండలోని కోటదుర్గమ్మ ఆలయాన్ని శనివారం జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి, జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్ సందర్శించారు. ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. ఇఒ సూర్యనారాయణ అమ్మవారి చిత్రపటాన్ని ఆయనకు అందించారు.

గర్భిణుల వసతిగృహ సిబ్బందిని కొనసాగించాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురం

ధర్నా చేస్తున్న నాయకులు, గర్భిణుల వసతిగృహ సిబ్బంది

గిరిజన గర్భిణుల వసతిగృహాల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కార్యదర్శి పి.రంజిత్ కుమార్ విమర్శించారు. గర్భిణుల వసతిగృహ సిబ్బందిని కొనసాగించాలని శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బాధితులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ 2018 లో గర్భిణుల వసతిగృహాల నిర్వహణ దేశంలోనే మొట్ట మొదట పార్వతీపురం ఐటిడిఎ ఆధ్వర్యంలో సాలూరు, గుమ్మలక్ష్మీపురంలో ప్రారంభించారని తెలిపారు. వీటివల్ల పార్వతీపురం ఐటిడిఎకు దేశ వ్యాప్త గుర్తింపు లభించిందని చెప్పారు. యునెస్కో, నీతి ఆయోగ్ కూడా ప్రశంసలు అందించాయని గుర్తు చేశారు. అంతటి గుర్తింపు తెచ్చిన ఈ వసతిగృహాల సిబ్బందికి గత 40 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం విచారకరమని తెలిపారు. కేవలం నెలకు నాలుగు లక్షల రూపాయలు నిర్వహణను భారంగా భావించి ఈ ఇక్కడి సిబ్బందిని తొలగించేందుకు సిద్ధపడడం, జీతాలు చెల్లించేందుకు నిర్లక్ష్యం వహించడం సరైన విధానం కాదని అన్నారు. ఇప్పటికైనా ఈ వసతిగృహాల నిర్వహణపై సమగ్రమైన విధానాన్ని రూపొందించి, ఇందులో పనిచేస్తున్న వారికి బకాయి వేతనాలు చెల్లించాలని, సిబ్బందిని అందరినీ కొనసాగించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. సిబ్బంది కొనసాగేందుకు ప్రయత్నం చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు పి.సంఘం, వసతిగృహ ఉద్యోగులు కరణం త్రివేణి, అలమండ రాములమ్మ, దాసర దేవి, ఇ.నాగమణి, గిరిజన సంఘాల నాయకులు పల్ల సురేష్, ఇంటికొప్పల రామకృష్ణ, ఆరిక చంద్రశేఖర్, దుక్క సీతారాం, రొంబ్బ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కొనసాగింపునకు మీనమేషాలెందుకు?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

దశాబ్దాలు తరబడి పనిచేస్తున్న కార్మికులను కొనసాగించేందుకు కంపెనీ యాజమాన్యం మీనమేషాలు లెక్కిస్తుండగా, శ్రమ జీవులకు ఆసరగా నిలబడాల్సిన ప్రభుత్వం, అందులోనూ కార్మిక శాఖ తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నాయి. దీన్నిబట్టి పాలకపక్షం ఎవరి ప్రయోజనం కోసం పనిచేస్తుందో వేరేగా చెప్పనక్కర్లేదని బాధిత కుటుంబాలతోపాటు కార్మికవర్గం, ఆ వర్గానికి నాయకత్వం వహిస్తున్న సిఐటియు వ్యాఖ్యానిస్తోంది. గరివిడి వద్దగల ఆర్‌బిఎస్ఎస్ఎఫ్ఎన్ అండ్ దాస్ కంపెనీలో గరివిడి, గుర్ల, చీపురుపల్లి మండలాలకు చెందిన 503 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరంతా గరివిడి మండలం దేవాడ, సదానందపురం మైన్స్ పరిధిలో 10ఏళ్ల నుంచి 35ఏళ్ల వరకు రెక్కల కష్టం చేసుకుని, తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నవారే. దేవాడ మైన్స్ లీజు ఒప్పంద కాలపరిమితి ఈ ఏడాది జనవరి 23న, సదానందపురం మైన్స్ లీజు సెప్టెంబర్ 14తో పూర్తి అయ్యింది. ఇది యాజమాన్యం చెబుతున్నమాట. ఈనేపథ్యంలో ఈ రెండు చోట్ల పనిచేస్తున్న కార్మికులను విదులనుంచి తొలగించి, సర్వీసు సెటిల్ మెంట్ చేస్తామంటూ యాజమాన్యం కార్మికులకు నోటీసులు జారీ చేసింది. సరే.... యాజమాన్యానికే పని లేనప్పుడు కార్మికులకు పనులు ఎలా కల్పిస్తారని అనుకోవచ్చు.



అలా అనుకుంటే పొరపాటే. లీజు పూర్తయినప్పటికీ కొత్త మైన్స్‌కు మళ్లీ టెండర్లలో యాజమాన్యం పాల్గొనేందుకు ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో తమకు సర్వీసు సెటిల్ చేయవలసిన అవసరం లేదని, ఒకవేళ ఈ యాజమాన్యానికి టెండర్లు రాకపోతే, ఈ విషయం మాట్లాడుతామని కార్మికులంతా సిఐటియు నాయకత్వంలో ఖరాఖండిగా చెబుతునే ఉన్నారు. అయినప్పటికీ యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోంది. ఓవైపు మైన్స్ లీజుల పునరుద్ధరణకు ప్రయత్నిస్తూనే, ఇంకోవైపు కార్మికులను ఇంటికి సాగనంపడానికి బరితెగిస్తోంది. సర్వీసు సెటిల్ మెంట్ చేయటానికి ప్రయత్నించడాన్ని నిరసిస్తూ కార్మికులంతా కొన్ని నెలలుగా అనేక రూపాల్లో నిరసన తెలియజేస్తునే ఉన్నారు. కంపెనీ యాజమాన్యం, మండల తహశీల్దార్ మొదలుకుని జిల్లా కలెక్టర్, ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత వరకు వినతి పత్రాలు అందజేసినా ఇప్పటికి వరకు ఫలితం దక్కలేదు. కార్మికులకు ఇచ్చిన నోటీసులపై సిఐటియు చూపిన చొరవ మేరకు న్యూఢిల్లీ సెంట్రల్ లేబర్ కమిషనర్ వారి కార్యాలయంలో ఒకసారి, వర్చువల్‌గా మూడుసార్లు గత నెల రోజులుగా చర్చలు జరిగాయి. అక్కడ కూడా కార్మికులకు న్యాయం చూపే విధంగా ఫలితాలు రాలేదు. దీంతో, యాజమాన్య వైఖరిపైనా, ప్రభుత్వ నిర్లక్ష్యంపైనా కార్మికులు తమ నిరసన కొనసాగిస్తున్నారు. డిఎఫ్ఎన్ వద్ద నిరసన దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్మికులపై యాజమాన్యం, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును జనం తప్పుపడుతున్నారు.

దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ వైశాలి

శంబరలో సబ్‌కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని శంబర గ్రామాన్ని శనివారం సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి సందర్శించారు. గ్రామంలోని ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను పునఃపరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె దరఖాస్తు చేసుకున్న వారితో పూర్తి వివరాలడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ భరత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

104 సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-సీతానగరం

రికార్డులను పరిశీలిస్తున్న మేనేజర్ కృష్ణ

104 వాహన వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని 104 జిల్లా మేనేజర్ ఎస్.కృష్ణ అన్నారు. శనివారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో 104 వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వారి పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పలు వివరాలను అడిగి వాహనంలో అన్ని రికార్డులు, మందుల లభ్యతను పరిశీలించారు. వాహనాన్ని తనిఖీ చేశారు. ప్రజలకు ఇంకా మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. వాహన కండిషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి, ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవీంద్రనాథ్ గౌతమ్

పథకాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న యువతి, యువకులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హస్తకళల ప్రతినిధులు కోరారు. శనివారం కురుపాం మండలంలో రెల్లిగూడ గ్రామంలో యూత్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో యువతకు నైపుణ్యాల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలరోజులపాటు యువతకు నైపుణ్యాలు నేర్పించి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా రూపొందిస్తామన్నారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రవీంద్ర గౌతమ్, ప్రసాదరావు, ఓంకార్ జోషి, బి.ఎస్.బెన్హర్, బి.అనిల్‌కుమార్, మాజీ సర్పంచ్ అప్పలస్వామి, మాజీ ఎంపిటిసి అడ్డమేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఒ తిరుపతిరావు

సహ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-పాచిపెంట

సమాచార హక్కు చట్టం-2005పై రైతులకు, వ్యవసాయ శాఖ సిబ్బందికి శనివారం పాంచాలి రైతు సేవా కేంద్రంలో ఎఒ కె.తిరుపతిరావు అవగాహన కల్పించారు. పాలనలో జవాబుదారీ తనం, పారదర్శకత ఉండడం కోసమే సమాచార హక్కు చట్టం తీసుకొచ్చారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

పెదభోగిలిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని పెదభోగిలిలో సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన ఎస్ఎన్ఎస్‌పిఎ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి పి.ఉషారాణి శిబిరానికి వచ్చిన ప్రజలకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఎస్‌వి రమణ, సూపర్వైజర్ ఎవి రవణమ్మ, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంబరాలు చేసుకుంటున్న జనసేన నాయకులు

గుమ్మలక్ష్మీపురంలో 'ఒజి' విజయోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జనసేన అరకు పార్లమెంట్ కార్యదర్శి కొణిశ రాజా ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురంలో ఒజి సినిమా విజయోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభిమానులు, యువత పటాసులు పేల్చి, కేక్ కట్ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎ.అనిల్, కొణిశ సుధీర్‌బాబు, కె.మురళి, కె.అనిల్, కోరాడ భార్గవ్, గుడ్ల మణి, సాయి, బి.మధు తదితరులు పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపు లబ్ధిని ప్రజలకు వివరించాలి

జెసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం

జిఎస్‌టి తగ్గింపుతో ప్రతి కుటుంబానికీ కలిగే లబ్ధిపై ప్రజలకు వివరించాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. అక్టోబర్ 19 వరకు జిల్లాలో సూపర్ జిఎస్‌టి... సూపర్ సేవింగ్స్ పేరుతో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిఎస్‌టి 2.0 కింద ప్రజలకు కలిగే ప్రయోజనాల అవగాహన కార్యక్రమాల నిర్వహణపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జెసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకులపై జిఎస్‌టి తగ్గింపుతో ప్రజలకు ఏ మేర లబ్ధి చేకూరనుందో ప్రతి కుటుంబానికీ తెలియజేయాలని అన్నారు. ఇందుకు ప్రభుత్వం నాలుగు వారాల పాటు ప్రతీ వారం ఒక నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించినట్లు చెప్పారు. అందులో భాగంగా ఈ నెల 29 వరకు ఇంటింటికీ సంక్షేమ ఫలాలు పేరుతో నిత్యావసర సరుకులు, మందులు, విద్య, స్టేషనరి, వస్త్రాలు, క్రీడా సామగ్రి, రవాణా కొనుగోళ్ల ద్వారా కలిగే లబ్ధిని గ్రామస్థాయిలో ఎస్‌హెచ్‌జి మహిళలు, గ్రామ కార్యదర్శులు, గ్రామాధికారులతో ఇంటింటికి వెళ్లి ప్రతి కుటుంబానికీ అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధిత



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

అధికారులు సమన్వయం చేసుకుని ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఈ నెల 30, అక్టోబర్ 1న వ్యవసాయం-అనుబంధ రంగాలు, ఉపాధి వేతనదారులకు, అక్టోబర్ 3, 4 తేదీల్లో ట్రేడింగ్, ఎంఎస్ఎంఇ, చేతివృత్తులు, పేపర్ అండ్ ప్యాకేజీలపై తగ్గిన ధరలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. 6న సెలూన్లు, స్పాలు, యోగా, జిమ్ తదితర కేంద్రాలకు కలిగే ప్రయోజనాలను వివరించాలని చెప్పారు. అక్టోబర్ 7న ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, 8న జూనియర్ కళాశాల, డిగ్రీ విద్యార్థులతో వక్తృత్వ పోటీలను నిర్వహించాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు.

9న లైఫ్ అండ్ మెడికల్ ఇన్సూరెన్స్‌ల ద్వారా కలిగే లబ్ధిపై అన్ని పిహెచ్‌సిలు, ఆసుపత్రులు, ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో అవగాహన కార్యక్రమాలు, జిల్లా స్థాయిలో మేళాలను నిర్వహించాలని సూచించారు. 10, 11వ తేదీల్లో జిల్లా స్థాయిలో ఉత్పాదకదారులు, డిస్ట్రిబ్యూటర్ల ద్వారా ఎలక్ట్రానిక్ పరికరాలపై తగ్గిన జిఎస్‌టిపై ప్రదర్శనను ఏర్పాటు చేయాలని, 13న వ్యాపారవేత్తలతో సెమినార్లు, స్వదేశీ వస్తువులపై ప్రదర్శన, ద్విచక్ర వాహనాలతో ర్యాలీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 14న భవన నిర్మాణ సామగ్రి, కాంట్రాక్టర్లకు కలిగే ప్రయోజనాలపై ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 15న పర్యాటకం, ఆతిథ్యాలపై కలిగే లబ్ధిపై సాండ్ ఆర్ట్, వివిధ శిబిరాలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా పర్యాటకులకు అవగాహన కలిగించాలని చెప్పారు. 16న రవాణా, లాజిస్టిక్స్ రంగంలో కలిగే లబ్ధిని రవాణా కంపెనీల ద్వారా చిన్న వాహనాలతో ర్యాలీలు, వీధుల్లో సభలు ఏర్పాటుచేయాలని సూచించారు. 17న బొమ్మలు, క్రీడా సామగ్రి కొనుగోళ్లలో కలిగే ప్రయోజనాలపై ప్రదర్శనలు నిర్వహించి అవగాహన కల్పించాలని తెలిపారు. అక్టోబర్ 18న ఇంధనం, ఆటోమొబైల్ రంగాల్లో కలిగే లబ్ధిపై బైక్ ర్యాలీలు, పిఎం సూర్య ఘర్, కుసుమ్‌పై ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. 19న జిల్లాస్థాయిలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, వాణిజ్య పన్నుల శాఖ ఉప కమిషనర్ డి.డేవిడ్ అనిల్, ఎస్‌డిసిలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'బెల్ట్' తీసేదెవరు?

యథేచ్ఛగా మద్యం విక్రయాలు • చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పాలకొండ

ప్రయివేట్ మద్య దుకణాల విధానం రావడంతో బెల్ట్ షాపులు జోరు ఎక్కువైంది. గ్రామాలతో పాటు పట్టణంలో పలు వీధుల్లో బెల్ట్ షాపుల్లో జోరుగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా 24 గంటలూ వీధివీధిన, సందుసందున మద్యం దొరుకుతూనే ఉంది. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీ చూడని ధోరణిలో వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బెల్ట్‌షాపు ఇదే

మండలంలో కొండాపురం, అంపిలి, లుంబురు, ఓని, పిపిరాజుపేట, ఎం.సింగపురం, గోపాలపురం, అట్టలి తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. పట్టణంలో గుడి, బడి అని తేడా లేకుండా ఆ సమీపంలోనే బెల్ట్ షాపులు వెలిసాయి. కోట దుర్గమ్మ ఆలయ సమీపంలో మూడు బెల్ట్ షాపులు ఉన్నాయి. అక్కడ అడ్డూ అదుపూ లేకుండా జోరుగా విక్రయాలు సాగుతున్నాయి. ఎన్‌కె రాజపురం దగ్గర వీరఘట్టం రోడ్‌లో, లుంబురు వారి జంక్షన్‌లో, గొల్లవీధి కూడలిలో ఇలా చెప్పుకుంటే పోతే వాడవాడల్లో బెల్ట్ షాపుల్లోనే మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

బాటిల్‌పై రూ.30 అదనం

బెల్ట్‌షాపుల్లో ఒక్కో బాటిల్‌పై 30 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. వైన్‌షాప్ వ్యాపారులంతా సిండికేట్‌గా ఏర్పడి అక్కడి నుంచే సరుకు బెల్ట్‌షాపులకు పంపిస్తున్నారు. దీంతో వీరు ఎంఆర్‌పి కంటే 30 రూపాయలు అదనంగా బెల్ట్‌షాపుల్లో వసూలు చేస్తున్నారు. చేసేదేమీ లేక మందుబాబులు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కాంప్లెక్సు వద్ద వరదనీటిలో నుంచి రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు

పట్టణంలో భారీ వర్షం

పలు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం పట్టణంలో శనివారం సాయంత్రం భారీవర్షం కురిసింది. దీంతో పట్టణ ప్రధాన రహదారితోపాటు బెలగాంలో ఉన్న అర్‌టిసి కాంప్లెక్స్ జలమయమయ్యాయి. రోడ్లపైనే వర్షపు నీరు ఎక్కువసేపు ప్రవహించడంతో రాకపోకలకు పాదచారులు, ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడ్డారు. కాంప్లెక్సు ఆవరణలో నీరు చేరడంతో అందులోనుంచే ప్రయాణికులు రాకపోకలు సాగించాల్సి వచ్చింది.

ఎదుగుదల సమస్యలను సకాలంలో గుర్తించాలి

ఆర్‌బిఎస్‌కె పిఒ జగన్మోహనరావు

చిన్నారుల ఎత్తు కొలుస్తున్న ఆర్‌బిఎస్‌కె పిఒ జగన్మోహనరావు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

చిన్నారుల్లో ఆరోగ్యపరమైన, ఎదుగుదల సమస్యలు సకాలంలో గుర్తించి చికిత్స అందించాలని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమ (ఆర్‌బిఎస్‌కె) ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు స్పష్టం చేశారు. మండలంలో గంగాపురం, కోరి, ఎంఆర్ నగరం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. వైద్య సిబ్బందితో కలిసి అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఆర్‌బిఎస్‌కెలో భాగంగా ప్రస్తుతం కొనసాగుతున్న పిల్లల హెల్త్ స్క్రీనింగ్‌పై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. పిల్లల్లో ఆరోగ్యపరమైన సమస్యలను కచ్చితంగా గుర్తించాలన్నారు. ఆన్‌లైన్ నమోదు తీరు పరిశీలించారు. పిల్లల ఎదుగుదల వివరాల రికార్డులు అంగన్వాడీ కేంద్రంలో పరిశీలించి, పిల్లల బరువు, ఎత్తు నివేదికలు ప్రతి నెలా నమోదు అవుతున్న తీరు తనిఖీ చేశారు. అక్కడ పరికరాలతో పిల్లల బరువు, ఎత్తు గుర్తించి రికార్డులో గణాంకాలతో గమనించారు. నివేదికలు కచ్చితంగా గుర్తించాలని, పోషకాహార లోపం గుర్తించిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పిల్లల తల్లిదండ్రులను సమావేశపరిచి ఎప్పటికప్పుడు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో నిర్ధారణ పరీక్షలు, మందుల లభ్యతపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గంగాపురంలో హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్య, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ చిన్నారుల ఆరోగ్యాన్ని పర్యవేక్షణ చేయాలని చెప్పారు. 4డిలు అయిన ఎదుగుదలలో ఆలస్యం, వైకల్యాలు, వ్యాధులు, పుట్టుకతో సంక్రమించే లోపాలు గుర్తిస్తే జిల్లా కేంద్రంలో ఉండే బాలల సత్వర చికిత్సా కేంద్రంలో(డిఇఐసి) చేర్చాలని ఆదేశించారు. ఇందుకు ఆర్‌బిఎస్‌కె వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డెమో సన్యాసిరావు, వైద్య సిబ్బంది భారతి, దుర్గమ్మ, దమయంతి, అంగన్వాడీ సిబ్బంది శ్రీదేవి, రవణమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు వెళ్లే రహదారి ఇదే

అధ్వానంగా శ్మశానవాటిక రహదారి

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలోని ఒట్టిగడ్డకు సమీపంలో ఉన్న శ్మశాన వాటిక రహదారి అధ్వానంగా ఉంది. దీంతో అంత్యక్రియలకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి చినుకు పడినా రహదారి చిత్తడి చిత్తడిగా మారడంతో మృతదేహాలు తరలించేందుకు మరిన్ని అవస్థలకు గురికావాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రిజిస్ట్రార్ అడ్డాయికి ఘన సన్మానం

ప్రజాశక్తి-సీతంపేట

శ్రీకాకుళం జిల్లాలో అంబేద్కర్ యూనివర్సిటీలో రిజిస్ట్రార్‌గా ఉద్యోగోన్నతి పొందిన బిడ్డిక అడ్డాయిని భారతి ఇంటర్నేషనల్ స్కూల్లో సామాజిక కార్యకర్త ఎస్‌పి పెంటయ్య ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించారు. భామిని మండలం నల్లరాయిగూడ చెందిన బిడ్డిక అడ్డాయి ఉన్నతస్థాయిలో నిలవడం గర్వకారణమని, మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలకొండ ఎస్‌టిఒ సవర భాస్కరరావు, డిఇ హేమంత్ కుమార్ రాజు, బేన్నాయి మాస్టారు తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రార్ అడ్డాయిని సన్మానిస్తున్న పెంటయ్య , ఉద్యోగులు

క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

తెగుళ్ల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-సీతంపేట

పాత పనుకోవలస సమీపంలోని ఎన్‌జి రంగా వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖాధికారులు శనివారం క్షేత్రపర్యటన చేపట్టారు. పంటల్లో పురుగులు, తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఉన్న పంటల పరిస్థితులపై చర్చించారు. యూరియా కొరత ఉన్న తరుణంలో నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. వరి, రాగులు, ఇతర ముఖ్యమైన ఖరీఫ్ పంటల దిగుబడికి తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ విస్తరణ శాస్త్రవేత్త పి.వెంకటరావు, వ్యవసాయ శాఖ ఎడిలు పి.సత్యవతి, రత్నకుమారి, శారద, ఎఒ వై.వాహిని, తదితరులు పాల్గొన్నారు.

పెద్దబుడ్డిడికి బస్సు సేవలు నిల్

అందని ద్రాక్షగానే ఉచిత ప్రయాణం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలంలోని పెద్దబుడ్డిడి గ్రామానికి మూడేళ్లుగా ఆర్‌టిసి బస్సు రాకపోకలు నిలిచిపోయాయి. పార్వతీపురం డిపో నుంచి నాగూరు, తురక నాయుడు వలస, రావివలస మీదుగా పెద్దబుడ్డిడి గ్రామానికి ఆర్‌టిసి బస్సు సర్వీసుతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు ప్రయోజనకరంగా ఉండేది. అయితే ఆర్‌టిసి అధికారులు పలు కారణాల రీత్యా బస్సు సర్వీసులను నిలిపివేశారు. వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి, బయట ప్రాంతాలకు వెళ్లి రావాలంటే ప్రైవేటు వాహనాలను రావివలస జంక్షన్ వరకు ఆశ్రయించాలి. అక్కడి నుంచి ఆర్‌టిసి బస్సులో వెళ్లాల్సి వస్తుంది. మారుమూల ప్రాంతాలకు ఆర్‌టిసి ప్రయాణం అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో మైదాన ప్రాంతంలో ఉన్న పెద్దబుడ్డిడి గ్రామానికి బస్సు సర్వీసులు లేకపోవడం గమనార్హం. తమ గ్రామానికి బస్సు నడపాలని పలుమార్లు గ్రామస్తులు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా కనీసం స్పందించలేదు. ప్రభుత్వం మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించినా వినియోగించుకోలేక పోతున్నామని గ్రామ మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు స్పందించి పెద్దబుడ్డిడి గ్రామానికి బస్సు నడపాలని కోరుతున్నారు.

ఘనంగా ఆయుధ పూజ

ప్రజాశక్తి -భామిని

భామిని దొరగా గుర్తింపు పొందిన కృష్ణచంద్రదొర ఇంట శనివారం ఆయుధపూజను ఘనంగా నిర్వహించారు. కృష్ణచంద్రదొర గిరిజన వంశస్తులు కావడంతో భామిని మండలంలోని గిరిజన కుటుంబాలు వీరితోపాటే దసరా ఉత్సవాలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఏటా విజయదశమి ముందు వచ్చే శని, ఆదివారాల్లో దసరా ఉత్సవాలను నిర్వహిస్తారు. అందులో భాగంగా ఈ ఏడాది శనివారం కృష్ణచంద్ర దొర కుమారుడైన నవీన్ చంద్ర దొర డప్పు వాయిద్యాలతో ఆయుధాలను వంశధార నదికి తీసుకువెళ్లి, శుభ్రపరిచారు. అనంతరం ఇంటి వద్ద ఆయుధ పూజ నిర్వహించారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-వీరఘట్టం

రసాయన ఎరువులకు స్వస్తి పలికి సేంద్రీయ ఎరువులతో పంటలు సాగు చేయాలని వ్యవసాయ అధికారి జె.సౌజన్య రైతులకు సూచించారు. శనివారం మండలంలోని కె.ఇచ్ఛాపురం గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. సేంద్రియ ఎరువు వాడటం వల్ల పంట దిగుబడి పెరిగి, పెట్టుబడి తగ్గుతుందని చెప్పారు. ఆ దిశగా సేంద్రియ ఎరువులతో పంట సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లేడు ఆకుతో తయారుచేసిన కషాయాన్ని పంటకు పిచికారి చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిసిఎన్ఎఫ్ మండల యాంకర్ ఎం.సింహాచలం, రైతులు పాల్గొన్నారు.

పొలంబడి కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి సౌజన్య

మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కొట్టుగుమ్మడ గ్రామానికి చెందిన రౌతు చిన్నమ్మడు (59) అనే మహిళ మృతదేహం శనివారం వట్టిగడ్డలో లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. చిన్నమ్మడు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వట్టిగడ్డకు వెళ్లింది. అయితే ప్రమాదవశాస్తు కాలుజారి ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో పడి కొట్టుకుపోయింది. అప్పటినుంచి కుటుంబ సభ్యులు గాలిస్తున్నప్పటికీ వ్యక్తి జాడలేదు. అయితే కొందరు వ్యక్తులు మృతదేహాన్ని చూడడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందజేశారు. ఆమె కుమారుడు అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు.